క్లుప్తంగా

కడ్తాల్‌లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కడ్తాల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కడ్తాల్‌లో స్థానిక ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారితో పాటు, ప్రధాన కాలనీల మీదుగా కవాతు నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సీఆర్పీఎఫ్, ఆర్మీ, పోలీసు బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేద్దాం

ముదిరాజ్ సంఘం నేత నర్సింహ



సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: ముదిరాజ్ కులస్తులను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నేతలు నర్సింహ, మాజీ ఎంపీపీ జయమ్మ, రాములు, రవీందర్, లింగం తదితరులు అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఆ సంఘం నేతలు సమావేశమయ్యారు. రెండు రోజుల క్రితం బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపిన ముదిరాజ్ నేతలను సంఘ పదవుల నుంచి తొలగిస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మాణం చేశారు. వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ప్రకటించిన ముదిరాజ్ సంఘ నాయకులు స్వచ్ఛందంగా సంఘ పదవులకు రాజీనామా చేయాలని సూచించారు. కులస్తులతో సంప్రదించకుండా, ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించని పార్టీకి ఏ విధంగా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తమకు 4 అసెంబ్లీ స్థానాలు ఇచ్చిందన్నారు. తమ సంఘం రాజకీయాలకు అతీతంగా ముదిరాజ్‌ల అభివృద్ధి, ఐకమత్యం కోసం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు సత్తయ్య, గణేశ్, నరేష్, వెంకటేశ్, ధనుంజయ్య, యాదగిరి, బుగ్గరాములు, గోపాల్ పాల్గొన్నారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు

సామాజిక విప్లవ రణభేరి ఎస్సీ పోరాట వేదిక



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జైభారత్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: నోటుకు ఓటు అమ్ముకోవద్దని జైభారత్ చేస్తున్న ఉద్యమం అభినందనీయమని సామాజిక విప్లవ రణభేరి ఎస్సీ పోరాట వేదిక కమిటీ సభ్యులు నర్సింగ్ అన్నారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానమంటూ ప్రచురించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు చూపే డబ్బు ఎరకు ఆశపడితే...మరో ఐదేళ్ల పాటు మోసపోవడం ఖాయమన్నారు. పార్టీలకతీతంగా అభ్యర్థుల ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థతను పరిగణలోకి తీసుకోని ఓటు వేయాలన్నారు. జైభారత్ ఆధ్వర్యంలో అణగారిన వర్గాలను చైతన్యం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా జస్ట్ ఓట్ క్యాంపెయిన్ చేపట్టడం అభినందనీయమన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత, నర్సింగ్ గోపి, సాత్విక్, నరేందర్, ఆంజనేయులు, కార్తీక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో..

వాహన డ్రైవర్‌కు రెండేళ్ల 9నెలల జైలు

యాచారం: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమైన ఓ డ్రైవర్‌కు ఇబ్రహీంపట్నం న్యాయస్థానం శుక్రవారం జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించింది. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై డీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో 2017లో నగరానికి చెందిన వెంకటయ్య అనే డ్రైవర్ బొలేరో వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడిపి ఎదురుగా వస్తున్న క్రూజర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో క్రూజర్‌లో ఉన్న 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో కేసు నమోదు చేసిన యాచారం పోలీసులు సమగ్ర వివరాలతో కోర్టుకు అందజేశారు. విచారణ చేపట్టిన ఇబ్రహీంపట్నం న్యాయస్థానం బొలేరో డ్రైవర్‌కు రెండేళ్ల 9 నెలల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- 'డబుల్'గా మారిన సింగిల్ రహదారులు
- లింకురోడ్లతో మండల కేంద్రాలకు తగ్గిన దూరం
- భూముల ధరలకు రెక్కలు



యాచారం: బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. నాడు సింగల్‌గా ఉన్న రోడ్లు నేడు డబుల్‌గా మారాయి. గుంతలమయంగా ఉన్న బీటీరోడ్లు నేడు సుందరంగా మారాయి. నాడు నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు సింగల్ రోడ్డుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. నేడు ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు రోడ్డు వెడల్పు కావడంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులకు ప్రయాణం సులభతరం అయ్యింది. గునుగల్ గేట్ నుంచి మంచాల మండలం లోయపల్లి రోడ్డు నాడు ఇరుకుగా ఉండేది. ఒక వాహనం వెళ్తుంటే, ఎదురుగా మరో వాహనం రాలేని పరిస్థితి. గునుగల్–లోయపల్లి రోడ్డులో నిత్యం ఎదో ఒకచోట ప్రమాదాలు జరుగుతుండేవి. నేడు రోడ్డు వెడల్పుతో ప్రమాదాలు జరగడం లేదు. సాగర్‌రోడ్డు తక్కళ్లపల్లి గేట్ నుంచి కందుకూరు మండలం మీరాఖాన్‌పేట వరకు, నక్కర్తమేడిపల్లి నుంచి కడ్తాల్ మండలం సరికొండ వరకు ఉన్న రోడ్లు వెడల్పు కావడం జరిగింది. ఆగాపల్లి గేటు నుంచి శ్రీశైలం హైవే రోడ్డు వరకు కూడా రోడ్లు వెడల్పు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషితో రూ.వంద కోట్లకు పైగా నిధులతో ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు వివిధ గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు, గ్రామీణ ప్రాంతా రోడ్లు సుందరంగా మారాయి.

ఆకాశాన్నంటిన ధరలు..

సర్కార్ కృషితో వెడల్పు అయిన రోడ్లతో వాటికి ఆనుకుని ఉన్న, చుట్టుపక్కల వ్యవసాయ భూముల ధరలకు రెక్కాలొచ్చాయి. నాడు రూ.లక్షల్లో ధరలు పలికే వ్యవసాయ భూములు నేడు రూ.కోట్లు పలుకుతున్నాయి. గునుగల్ గేట్ నుంచి లోయపల్లి రోడ్డు మరమ్మతులు కావడంతో రోడ్డుకిరువైపులా వ్యవసాయ భూముల ధర ఎకరాకు రూ.కోటికి పైగానే దాటింది. ఆగాపల్లి గేట్ నుంచి శ్రీశైలం హైవే, చర్లపటేల్‌గూడ గేట్ నుంచి ఏలిమినేడ్ వరకు రోడ్డును వెడల్పు చేశారు. ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు సాగర్ హైవేకు ఇరువైపులా ఉన్న రోడ్లు మరమ్మతులకు నోచుకోవడంతో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ భూమి ఎకరాకు రూ.రెండున్నర కోట్లు దాటింది. ఫార్మాసిటీ సమీపంలో ఉన్న నందివనపర్తి, నస్దిక్‌సింగారం మీరాఖాన్‌పేట తదితర గ్రామాల్లో ఎకరా ధర రూ.రెండు కోట్లు దాటింది. యాచారం–కందుకూర్ రోడ్డు పక్కన భూముల ధరలు రూ.కోట్లల్లో పలుకుతున్నాయి. రియల్ వ్యాపారులు, కొనుగోలుదారులు రోడ్ల పక్కనే ఉన్న భూములను కొనుగోలు చేసి వెంచర్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు రోడ్ల పక్కనే ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫాంహౌజ్‌లు, పండ్ల తోటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి గృహ నిర్మాణాలు నిర్మించుకుంటున్నారు. వారాంతపు సెలవుల్లో కుటుంబ సభ్యులతో వచ్చి దావత్‌లు చేసుకుంటూ హాయిగా గడుపుతున్నారు.

ప్రయాణం సులభతరమైంది



నక్కర్తమేడిపల్లి–సరికొండ రోడ్డు వెడల్పుతో యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. నాడు రోడ్డు గుంతలమయంగా ఉండేది.. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డును బీటీగా మార్చారు. నిత్యం వందలాది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

– పాశ్చ భాష, మాజీ సర్పంచ్, నక్కర్తమేడిపల్లి

భూముల ధరలు పెరిగాయి



గునుగల్ గేట్ నుంచి లోయపల్లి వరకు రోడ్డు వెడల్పు చేశారు. దీంతో రోడ్డుకిరువైపులా ఉన్న వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఎకరా ధర రూ.కోటిన్నరకు పైగానే డిమాండ్ ఉంది. పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, రాజకీయ నేతలు రోడ్డు పక్కన ఎకరా, రెండు ఎకరాల చొప్పున భూములు కొని ఫాంహౌజ్‌లు, పండ్లతోటలు నిర్మించుకుంటున్నారు.

– జంగయ్య, సర్పంచ్, గడ్డమల్లయ్యగూడ

కేసీఆర్‌ది సంక్షేమం.. విపక్షాలది సంక్షోభం

- అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాం
- తెలంగాణపై విషం కక్కుతున్న ప్రధాని
- మొసలి కన్నీళ్లు కారుస్తున్న ప్రతిపక్ష నాయకులు
- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, హర్షగూడ ఉప సర్పంచ్ రవినాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని హర్షగూడ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ మంత్రిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల కోట్ల నిధులను మంజూరు చేయించి మహేశ్వరం మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. మహేశ్వరాన్ని విద్యానిలయంగా మార్చిన ఘనత సబితారెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నేడు ప్రచారం..

మహేశ్వరం మండలంలో శనివారం సబితారెడ్డి పర్యటిస్తారని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రచారంతో పాటు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు ఉంటాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ నాయకులవి మొసలి కన్నీళ్లు..

కందుకూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అభ్యర్థించారు. కేసీఆర్‌ది సంక్షేమ పాలన.. ప్రతిపక్షాలది సంక్షోభమని విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని 9 గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని మండిపడ్డారు. కారు గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.



ప్రచారంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

భారీ మెజార్టీతో గెలిపించండి

మహేశ్వరంలో సబితారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కోరారు. జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని వినాయక హిల్స్ కాలనీలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువ ఓటర్లను కలుసుకుని కారుగుర్తుకు ఓటు వేసి మరోమారు మంత్రి సబితారెడ్డిని గెలిపించాని కోరారు. వినాయకహిల్స్ కాలనీల రూపురేఖలు మార్చిన మంత్రి గెలిపించుకుందామన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ లావణ్య ధీమావ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజు, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో..

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలోని 4వ డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ స్వప్న, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి సబితారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ర్యాలీ

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి గెలుపును కాంక్షిస్తూ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడాకాంప్లెక్స్‌లో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి సబితారెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు బాలకిషన్, మాజీ కార్పొరేటర్ అనిత, కొండల్‌రెడ్డి, మహేందర్ యాదవ్, ఇంటూరి అంకిరెడ్డి, దర్పల్లి అశోక్, కొండా గిరిగౌడ్, రాజేష్‌గౌడ్, ధరంవీర్‌రెడ్డి, అనూర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పట్నం'లో ఓటర్ అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో హెచ్‌ఆర్‌డీ పాఠశాల విద్యార్థులచే ఓటుహక్కు వినియోగంపై ప్రత్యేక కళా ప్రదర్శన చేయించారు. అదే విధంగా ర్యాలీ తీసి ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మనం వేసే ఓటు మనం ఉండే ప్రాంతం, మన రాష్ట్రం, దేశ అభివృద్ధికి పునాదిలాంటిదన్నారు. నిరుపేదల పనులు చేసే, ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. ఆర్‌ఐలు కృష్ణ, పుష్పలత మున్సిపల్‌అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

యాచారం: కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ విషం తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు... మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లికి చెందిన జంగమ్మ(35) ఇంటింకి సంబంధించి ఆర్థిక ఇబ్బందులు, తగాదాలు భరించలేక నాలుగు రోజుల క్రితం విషం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జంగమ్మను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా జంగమ్మ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

- పేదల భూములను గుంజుకుంటున్న సీఎం
- ప్రజలను మోసం చేసిన సబితారెడ్డి
- ఆరు గ్యారెంటీలతో అందరికీ న్యాయం
- కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్

కందుకూరు: పేదలకు కాంగ్రెస్ హయాంలో భూములిస్తే, ఇప్పుడు ఆ భూములను సీఎం కేసీఆర్ గుంజుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేఅభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని 13 గ్రామాల్లో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పడుకుని ప్రజలకు అన్ని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి కాంగ్రెస్ తరఫున గెలిచి.. బీఆర్‌ఎస్‌లో చేరి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి ఏమైయిందని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పే వారికి కాకుండా మాటపై నిలబడ్డ కాంగ్రెస్‌కే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అసైన్డ్, లావణ్య, భూదాన్ భూములకు పట్టాలిస్తామని భరోసా ఇచ్చారు. అందరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, వైస్ ఎంపీపీ శమంత, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు నర్సింహాచారి, నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, నర్సింహ, వీరేశ్, వీరారెడ్డి, రాంరెడ్డి, రంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జగదీష్, ప్రశాంత్‌రెడ్డి, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు: ప్రతీ ఓటర్ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 5, 12వ వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిసనర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని.. అలాంటి విలువైన ఓటును ఆచితూచి వేయాలన్నారు. ఈనెల 30న ఓటర్లంతా పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి ఓటు వేయాలని సూచించారు. ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్‌లు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది స్వాతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ ..

తుర్కయంజాల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది పలు వార్డుల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరుగుతూ ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఓటింగ్ శాతం పెంచడానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న కమిషనర్ శ్యాంసుందర్

రేపు ప్రజా ఆశీర్వాద సభ

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణంలో ఆదివారం జరిగే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయ కులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చంద్రయ్య, బాలకుమార్‌గౌడ్, బుచ్చయ్య, అశోక్, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ

మలక్‌పేట: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ప్రొసీడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మూసారంబాగ్ ఆరోరా కాలేజీలో శిక్షణ ఇచ్చారు. మలక్‌పేట ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు కార్డును, తీసుకొచ్చిన వివరాలను పరిశీలించి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించినా సరిపోతుందన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

సాధారణ ఎన్నికల పరిశీలకుడు నినామా



ఇబ్రహీంపట్నం: ఎన్నికల సమస్యలపై ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు తనకు ఫిర్యాదులు చేయవచ్చునని ఇబ్రహీంపట్నం సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఆర్‌ఎస్ నినామా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో నవంబర్ 29వ తేదీ వరకు ఎన్నికల విషయంలో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులున్నా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. నేరుగా లేదా ఫోన్ ద్వారా సమస్యలను తెలుపవచ్చునన్నారు. 94260 18818 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న 'పట్నం'

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి
- ఎంపీపటేల్‌గూడలో ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎంపీపటేల్‌గూడలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనే ఇబ్రహీంపట్నం వెనకబడిన ప్రాంతంగా ఉండేదన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీఆర్‌ఎస్ ప్రభుత్వ సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎంతో చేశారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం రవీందర్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యులు అబేదాబేగం, గుండ నర్సింహ, లక్ష్మి, పప్పి, అశోక్, జగన్, బాలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో వెంకటరమణారెడ్డి

మహిళల సంరక్షణే ధ్యేయం

- పక్షం రోజుల్లో 126 మంది ఆకతాయిల అరెస్టు
- వీరిలో మైనర్లు 68, మేజర్లు 58 మంది
- ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్

నాగోలు: మహిళల సంరక్షణే ధ్యేయంగా రాచకొండ షీ టీమ్స్ పనిచేస్తున్నాయని రాచకొండ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్ అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 15 రోజుల్లో 126 మంది ఆకతాయిలను రాచకొండ షీ టీమ్స్ పట్టుకున్నాయి. వీరిలో 58 మంది మేజర్స్, 68 మంది మైనర్లు ఉన్నారు. వీరిని షీ టీమ్స్ అరెస్టు చేశారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీపీ ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ, మహిళలను వేధించే వారికి 'ఎల్లప్పుడూ మీకోసం..మీతో' అనే నినాదంతో రాచకొండ షీటీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. నిత్యం షీ టీమ్స్ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు,బహిరంగప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, మహిళలను వెంబడిస్తూ వేధించే పోకిరీలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ.. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. గత అక్టోబర్ 16 నుంచి 31 వరకు 148 ఫిర్యాదులు అందాయని, వీటిపై విచారణ చేసి దర్యాప్తు పూర్తి చేశామన్నారు. ఈ ఫిర్యాదుల్లో ఫోన్ల ద్వారా వేధించిన ఘటనలు 8, వాట్సాప్ కాల్స్,ఎస్‌ఎంఎస్‌ల ద్వారా వేధించినవి16, సోషల్ మీడియా ద్వారా వేధించినవి 8, నేరుగా వేధించినవి 116 ఉన్నాయన్నారు. ఇందులో క్రిమినల్ కేసులు 7, పెట్టి కేసులు 55 కాగా, మొత్తం 86 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారని తెలిపారు. రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్‌లోకి వెళ్లే ప్రయాణిస్తున్న ఆరుగురిని పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా జరిమానా వేయించామన్నారు. రాచకొండ పరిధిలో గత నెల అక్టోబర్ 16 నుంచి 31వ తేదీ వరకు రాచకొండ షీ టీమ్స్ 53 అవగాహన కార్యక్రమాలునిర్వహించామన్నారు. రాచకొండ పరిధిలో మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే షీ టీమ్స్ రాచకొండ వాటాప్స్ నం. 8712662111కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశం, ఇన్స్పెక్టర్ పి.పరశురాం, అడ్మిన్ ఎస్‌ఐ రాజు, టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ శాంతిప్రియ, రమ్య, శ్యామల గౌరి పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ ఉషా విశ్వనాథ్

మద్యం విక్రయాలపై నిఘా

- బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు
- ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్

ఆమనగల్లు: ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం 'సాక్షి'తో సీఐ బద్యానాథ్‌చౌహాన్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు, విక్రయాలపై నిఘా ఉంచినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు మద్యం దుకాణాలను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం మద్యం విక్రయిస్తున్నారా లేదా అని పరిశీలిస్తున్నామని చెప్పారు. గ్రామాలు, తండాలకు అక్రమంగా మద్యం తరలకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో నాటుసారా తయారుకాకుండా విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. నల్లబెల్లం, సారా తయారీకి అవసరమయ్యే ముడిసరుకులు విక్రయిస్తే చర్యలు తప్పవని.. గ్రామాలు, తాండాలు, మరే ప్రాంతంలో గాని మద్యం డంప్‌చేస్తే.. ప్రజలు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నాలుగు మండలాల పరిధిలో ఉన్న హోటల్స్, దాబాలలో మద్యం విక్రయించరాదని సూచించారు. ఫంక్షన్‌హాల్స్, రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో జరిగే ఫంక్షన్స్, ఈవెంట్స్‌లలో అనుమతి లేకుండా మద్యం ఉంచరాదని అవసరమైతే నిర్వాహకులు మద్యంకోసం పర్మిట్ తీసుకోవాలని సూచించారు. అక్రమ మద్యం ఉన్నా, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా, నల్లబెల్లం విక్రయిస్తున్నా ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని లేదా టోల్‌ఫ్రీ నంబర్ 18004252325 కు ఫిర్యాదు చేయవచ్చని సీఐ సూచించారు.

